క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీ కాకతీయుల కాలం నాటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ గర్భగుడి పునర్నిర్మాణానికి గాను బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏర్పుల నర్సింహ, కార్యదర్శి నీలకంఠం నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చండూరు : చండూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ చౌరస్తా వద్ద గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాంధీజీ ఫౌండేషన్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్, భూతరాజు వేణు, గజ్జల కష్ణారెడ్డి, భీమనపల్లి శేఖర్, బ్రహ్మం, ఐతరాజు మల్లేష్, నలపరాజు సతీష్, శిరంశెట్టి శ్రీధర్ బాబు, మహేష్ పాల్గొన్నారు.

నగదు పట్టివేత

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేని నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ డి.సైదాబాబు తెలిపారు. వివిధ వాహనాల్లోని వ్యక్తుల వద్ద ఆధారాలు లేని రూ.1.40లక్షలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆ నగదును ట్రెజరీ అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ క్రైం : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాసరావు అన్నారు. బుధవారం అన్నెపర్తి బెటాలియన్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైద్యుల బృందం బెటాలియన్ సిబ్బంది ఆరోగ్యాన్ని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు.కార్యక్రమంలో డాక్టర్లు విఠల్ బాబు, పుల్లారావు, కిరణ్‌కుమార్, గిరి, ఈశ్వర్, రాంమోహన్, ప్రియాంక పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు


చండూరులో మాట్లాడుతున్న నాయకులు

చండూరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీజేపీ మండల, పట్టణ నాయకులు విమర్శించారు. బుధవారం చండూరులో వారు విలేకరులతో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల నాయకులకు బీజేపీ పెద్ద పీట వేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్వలేక పోతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ చైతన్యం ద్వారా భువనగిరి సీటును బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. సమావేశంలో బీజేపీ మున్సిపల్, మండల అధ్యక్షులు పందుల సత్యం గౌడ్, ముదిగొండ ఆంజనేయులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, నకిరేకంటి లింగస్వామి, పిన్నింటి నరేందర్ రెడ్డి, సముద్రాల వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయం

మునుగోడు: త్వరలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడుతామని అంటున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని చెప్పారు. బుధవారం ఆయన మునుగోడులో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాటు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాల్లో గెలుపొందుతుందని అన్నారు. సమావేశంలో భువనగిరి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, లింగయ్య, సైదులు, లక్ష్మీనారయణ, సత్తయ్య, యాదయ్య ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మెరుగైన వసతులు

మర్రిగూడ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతుల కల్పనకు చొరవ తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని శివన్నగూడ, ఖుదాబాక్షపల్లితోపాటు పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు మొదలైన సౌకర్యాలు ప్రతి కేంద్రంలో ఉండాలని సిబ్బందికి సూచించారు. సరంపేటతండాలో నూతనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఆర్ఐ బషీర్‌అలీ, బీఎల్‌వోలు ఉన్నారు.

ఇంటర్‌లో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు

- ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు
- ఉత్తమ మార్కులు సాధించిన పేదింటి బిడ్డలు

నల్లగొండ: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు మెరిశారు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రైవేట్ కాలేజీలకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించారు. జిల్లాలోని గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. మెజార్టీ కాలేజీల్లో 70శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గురుకుల జూనియర్ కాలేజీలతో పాటు మోడల్ స్కూల్ కేజీబీవీ విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ కాలేజీకి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు 497 మంది పరీక్ష రాయగా 378 మంది ఉత్తీర్ణులై 76.6 శాతం ఉత్తీర్ణత సాదించారు. ద్వితీయలో 787 మంది పరీక్షకు హాజరు కాగా 702 మంది పాసై 89.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలో ఫస్టియర్‌లో 609 మందికి 447 మంది పాసై 73.4 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయలో 625 మందికి 558 మంది పాసై 89.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజిలో మొదటి సంవత్సరంలో 1638కి 800 మంది పాసై 48.4 ఉత్తీర్ణులయ్యారు. కేజీవీబీలో ద్వితీయ సంవత్సరం 1703 మందికి 1157 మంది పాసయ్యారు.. మైనార్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో 274 మందికి 241 మంది పాసై 87.90 శాతం ఉత్తీర్ణత పొందగా, ద్వితీయ సంవత్సరంలో 263 మందికి 246 మంది పాసై 93.54 శాతం ఉత్తీర్ణత సాధించారు. బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో 947 మందికి 694 మంది పాసై 73.81 ఉత్తీర్ణత పొందారు. ద్వితీయ సంవత్సరంలో 628 మందికి 528 మంది పాసై 84.8 శాతం ఉత్తీర్ణత సాధించారు.

'గురుకుల' విద్యార్థినికి ఉత్తమ మార్కులు

నల్లగొండ రూరల్: ఇంటర్ ఫలితాల్లో నల్లగొండ మండలం అప్పాజీపేట గురుకుల కాలేజీకి చెందిన


మనీషా

మనీషాకు ఇంటర్ ప్రథమ సంవత్సరం హెచ్ఈసీలో 500కు 493 మార్కులు సాధించి ప్రతిభ చూపింది. ఆ విద్యార్థినిని కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్లయ్య, ఉపాధ్యాయులు జహంగీర్, శ్రీను, సంధ్య, లక్ష్మి అభినందించారు.

అమ్మాయిలదే హవా

మర్రిగూడ: మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించిన ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫలితాలు బుధవారం వెలువడగా బాలికలే పైచేయి సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో చెరుపల్లి అమూల్యవర్షిణికి 924, సుంకరి అఖిలకు 910, బైపీసీలో జోకుపర్తి సలోమి 842 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జంపాల తేజస్వి 459, మాదగోని శ్రావ్య 459, బైపీలో జర్పుల రాజేశ్వరి 354 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి తెలిపారు. మొదటి సంవత్సరంలో 104 మంది విద్యార్థులకు 58 మంది ఉత్తీర్ణత సాధించగా 56శాతం, ద్వితీయ సంవత్సరంలో 101మందికి గాను 75 మంది ఉత్తీర్ణత సాధించగా 76శాతం ఉత్తీర్ణులైనట్లు తెలిసింది.


అమూల్య వర్షిణి


అఖిల


సలోమి

ఆదర్శ పాఠశాలలో..

కనగల్ : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని శ్రీ అక్కెనపల్లి వెంకటేశ్వర్‌రావు మెమోరియల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగానికి చెందిన చల్లా మీనాక్షి 470మార్కులకు గాను 463, బైపీసీ విభాగానికి చెందిన శీలం పూజిత 440కి 410, సీఈసీ వట్టికోటి గౌతమి 500కి 464 ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎంపీసీ విభాగంలో మాదగోని కీర్తనకు 1000మార్కులకు 972, బైపీసీ విభాగంలో నెల్లూరి మానస 1000కి 976, సీఈసీ విభాగంలో కర్నాటి అంజలి 1000కి 881మార్కులు సాధించి సత్తాచాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి పాఠశాల ప్రిన్సిపాల్ మమత అభినందనలు తెలిపారు.

చెర్కుపల్లి కేజీబీవీలో..

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియల్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ విభాగంలో 1000 మార్కులకు గాను పి.స్వప్న 840 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో ఎస్.రేణుక 914 మార్కులు, ప్రథమ సంవత్సరం సీఈసీలో 500 మార్కులకు కె.ప్రేమలత 460, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో పి.పావని 469 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 48 మంది విద్యార్థులకు 36 మంది(77శాతం), ఉత్తీర్ణులు కాగా, ద్వితీయ సంవత్సరంలో 46 మంది విద్యార్థులకు 37 మంది(80.40శాతం) ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

కొర్లపహాడ్ ఆదర్శ పాఠశాలలో..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో కళాశాలకు చెందిన ఎస్.శ్రీసత్య రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 981, కె.అఖిల 959, బైపీసీ విభాగంలో జి.లిఖిత 1000 మార్కులకు గాను 947 మార్కులు, సీఈసీ విభాగంలో పి.నవ్య 719 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో డి.పూజ 470 మార్కులకు గాను 442 మార్కులు, బైపీసీ విభాగంలో సీహెచ్.క్రిష్ణవేణి 440 మార్కులకు గాను 397 మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను కె.శ్రీవల్లి 402 మార్కులు పొంది ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 69 మంది విద్యార్శులకు గాను 36 మంది(52శాతం), ఉత్తీర్ణులు కాగా, ద్వితీయ సంవత్సరంలో 68 మంది విద్యార్థులకు 46 మంది(68శాతం) ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సబితారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నకిరేకల్ : నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ గ్రూపుల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.మల్లారెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎస్.మమత(ఎంపీసీ–951/1000), పావని (బైపీసీ–701 /1000), ఎస్.నవనీత(845/1000), ప్రథమ సంవత్సరంలో గూడూరు సౌజన్య (ఎంపీసీ–427/470), వెన్నెల (బైపీసీ–346/440), శివ (సీఈసీ–379/500) మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.


మమత,957

తండ్రి చనిపోయినా మొక్కవోని ధైర్యంతో..

కేతేపల్లి: కేతేపల్లి మండలం గుడివాడ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రాచకొండ లింగయ్య, జ్యోతిల కుమార్తె రేణు శ్రీ జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 984 మార్కులు సాధించి కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. తండ్రి లింగయ్య రేణుశ్రీ చిన్నతనంలో ఉండగానే చెరువులో చేపల వేట కోసం వెళ్లి ప్రమాదశవాత్తు నీటిలో మునిగి మరణించాడు. దీంతో బాబాయి, నానామ్మల సంరక్షణలో పెరిగిన రేణుశ్రీ మోత్కూరులోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివింది. తండ్రి చనిపోయినా అధైర్యపడకుండా చదివి ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. ఐటీ రంగంలో రాణించటమే లక్ష్యంగా కఠోరమైన సాధన చేసి చక్కటి ప్రతిభతో అందరితో శభాష్ అనిపించుకుంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే తన లక్ష్యాన్ని సాధించుకుంటానని రేణుశ్రీ ధీమాగా ఉంది. ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రేణుశ్రీని బీజేపీ మండల అధ్యక్షులు రాచకొండ గోపి అభినందించారు.


రేణుశ్రీ

'గురుకుల' విద్యార్థుల సత్తా

మునుగోడు: ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాల్లో మునుగోడు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో మొత్తం 78 మంది విద్యార్థినులకు గాను 64మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 77మందికి 75 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైయిన వారిలో మొదటి సంవత్సరం ఎంపీసీలో టి.అర్చన 470 మార్కులకు 465 మార్కులు సాధించింది. అదే విధంగా బైపీసీలో 440 మార్కులకు 434 మార్కులు సాధించిన ఎం.వాణి టాపర్‌గా నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ 1000 మార్కులకు ఎండ్ల దీక్షిత 991 మార్కులు, బైపీసీలో గోశిక రేణుశ్రీ 977 మార్కులు దక్కించుకున్నారు.

కేజీబీవీల్లో 91శాతం ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో మునుగోడులోని కేజీబీవీ కళాశాల విద్యార్థినులు అంతగా ప్రతిభ కనబర్చలేదు. ఆ కళాశాలల్లో మొదటి సంవత్సరం 57మంది పరీక్షలు రాయగా 45మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 57మందికి 52 మంది పాసయ్యారు.

అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర


అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

నార్కట్‌పల్లి : లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సంబంధిత అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నల్లగొండ ఏఆర్‌ఓ, నకిరేకల్ నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల విధులు చాలా కీలకమని, ప్రతి అంశం చాలా జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఈవీఎంలపై అధికారులకు మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, లాల్‌బహదూర్ శాస్త్రీ, రాజు, జమీరుద్దీన్, ప్రసాద్, కృష్ణ, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.

కేసీఆర్ మీటింగ్‌లో దొంగల చేతివాటం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలో బుధవారం జరిగిన మాజీ సీఎం కేసీఆర్ మీటింగ్‌లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. నల్ల గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జేబులోని పర్సు, తిప్పర్తికి చెందిన జాకటి డానియల్, ఏశబోయిన మల్లేష్ మెడలోని తులంన్నర బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వీరితో పాటు రామలింగాలగూడేనికి చెందిన వనపర్తి నాగేశ్వరరావు చెందిన రూ. 15వేల నగదును దుండగులు చోరీ చేశారు. జాకటి డానియల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నకిరేకల్‌లో కేసీఆర్‌కు ఘన స్వాగతం


కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

నకిరేకల్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రగతి రథం బస్ యాత్ర బుధవారం రాత్రి 8గంటల 25 నిమిషాలకు నకిరేకల్‌కు చేరుకుంది. మిర్యాలగూడ నుంచి నకిరేకల్‌లోని చీమలగడ్డ బైపాస్ వద్దకు చేరుకున్న ఆయనకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు కేసీఆర్ మాట్లాడారు. ఇదే ఉత్సాహం కొనసాగించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, యాదాద్రి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ ధనలక్ష్మీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు అన్న ప్రసాద వితరణ


అన్న ప్రసాద వితరణను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: శ్రీ సత్యసాయిబాబ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో చిట్యాలలో బుధవారం శ్రీపుట్టపర్తి సత్యసాయిబాబా ఆరాధన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పూజలు చేశారు. అనంతరం సేవా సమితి సభ్యులు మున్సిపల్ కార్మికులకు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, కోనేటి క్రిష్ణ, నాయకులు జమాండ్ల శ్రీనువాస్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు మేడిశెట్టి శ్రవణ్‌కుమార్, నీల సత్యనారాయణ, రేగొండ వేణుమాధవ్, చంద వెంకన్న, పందిరి గీతా, ఝాన్సీ, నాగలక్ష్మీ, జ్యోతి, జయ, స్పందన, అరుణ, రజిని పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారెడ్డి

మర్రిగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని టీపీసీసీ కోఆర్డినేటర్, మునుగోడు ఇన్‌చార్జి సంధ్యారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని ఆమె మాట్లాడారు. కార్యకర్తలతోపాటు బూత్ స్థాయి నుంచి కూడా ప్రతి ఒక్కరూ కష్టపడి అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా చొరవ చూపాలన్నారు. ఈనెల 26న మండలానికి విచ్చేయనున్న అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఘన స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో నాయకులు పబ్బు రాజు, రాందాస్ శ్రీనివాస్, వెన్నమనేని రవీందర్‌రావు, బేత వెంకటేష్‌యాదవ్, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మేకల జగన్‌రెడ్డి, వెంకటంపేట బాలయ్య, మేతరి యాదయ్య, మాజీ ఎంపీపీ పాముల యాదయ్య, పాల్వాయి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27నుంచి ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్స్ శిక్షణ తరగతులు


చిట్యాల మండలం ఉరుమడ్లలో కరపత్రాలను విడుదల చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఈ నెల 27వ తేది నుంచి ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్స్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆ శిక్షణ తరగతుల ప్రచార కరపత్రాలను బుధవారం గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి విడుదల చేశారు.కార్యక్రమంలో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు, గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, జన్నపాల శ్రీను, బోయస్వామి, పోలగోని శ్రీశైలం, మర్రి అశోక్, ఉడుగు పాండు, మర్రి రమేష్, పోలగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ స్వామికి పరామర్శ

మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనను రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో వనమా వెంకటేశ్వర్లు, పల్లపు బద్దుడు, జన్నపాల శ్రీను, మర్రి అబ్బయ్య, మర్రి రమేష్, బోయ స్వామి పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్


మునుగోడు పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్ కుమార్

మునుగోడు: విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే రైతులకు విక్రయించాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ ఫర్టిలైజర్ వ్యాపారులకు సూచించారు. బుధవారం మునుగోడులోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువులు, విత్తనాల నిల్వలతోపాటు ఈపాస్ మిషన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్నందున వ్యాపారులు రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు ఎంత మొత్తంలో ఉన్నాయో ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారులు, వ్యాపారులు ఉన్నారు.

బీజేపీని తరిమికొట్టాలి


ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

శాలిగౌరారం: పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎంకు మద్దతు ఇచ్చి మతోన్మాద బీజేపీని తరిమికొట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ అన్నారు. భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్ గెలుపు కోరుతూ మండల కేంద్రంలో ఆయన బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలపక్షాన నిలిచే సీపీఎంను ఆదరించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఆపార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, మక్క బుచ్చిరాములు, లింగయ్య, డెంకల లింగయ్య పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వీఎస్ నియోజకవర్గ కార్యదర్శిగా హరీష్


పొడిచేటి హరీష్

కట్టంగూర్ : సమాచార హక్కు వికాస సమితి(ఎస్‌హెచ్‌వీఎస్) నకిరేకల్ నియోజకవర్గ కార్యదర్శిగా కట్టంగూర్‌కు చెందిన పొడిచేటి హరీష్‌ను నియమిస్తూ ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005పై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు సమితి అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

నీలగిరి కళాశాల విద్యార్థుల ప్రభంజనం


జె. మానస


ఆర్. మమత


కె.మహేశ్వరి


ఎన్. దేవిశ్రీ

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని నీలగిరి కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి తెలిపారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో జే మానస, 981, బైపీసీ విభాగంలో 964 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. కళాశాలకు చెందిన 30మంది విద్యార్థులు 900 మార్కులకుపైగా దక్కించుకున్నారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో మహేశ్వరి 463, బైపీసీలో దేవిశ్రీ 440 మార్కులు సాధించగా 20 మంది 400 మార్కులు వచ్చాయని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు కళాశాల అధ్యాపకులను ఆయన అభినందించారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం సాధ్యం


మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీజేపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు బీసీ వ్యక్తిని సీఎంగా ప్రకటించిన పార్టీ బీజేపీ అని, ఓబీసీలందరూ బీజేపీకి ఓట్లేసి గెలిపించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మయోజన పథకం తీసుకువచ్చి 18రకాల చేతి వృత్తిదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణ సుదపాయం కల్పించినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. 400 సీట్లలో నల్లగొండ ఉంటుందని, బీజేపీ గెలిస్తేనే నల్లగొండ అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, జక్కలి రాజు యాదవ్, మదన్‌మోహన్, యాదగిరాచారి, వెంకటేష్, భవనీప్రసాద్, ఏరుకొండ హరి, తిరాందసు కనకయ్య, దినేష్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ వెనుక జమ్మికి నిప్పు

- భారీగా లేచిన మంటలు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నకిరేకల్ : గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బంక్ వెనుక భాగంలోని జమ్మికి నిప్పు పెట్టడంతో భారీగా మంటలు వ్యాపించాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్‌లో పెద్ద చెరువు కింద తాటికల్ రోడ్డు లోని టీపీసీసీ నేత దైద రవీందర్ పెట్రోల్ బంక్ ఉంది. మంగళవారం మధ్యాహ్నం దుండగులు జమ్మిగి నిప్పంటించడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన బంక్ సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చిమంటలు ఆర్పే ప్రయత్నం చేసి మంటలు గాలికి అదుపులోకి రా లేదు. ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలు ఆర్పివేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని దైద రవీందర్ పరిశీలించారు. ప్రతి ఏటా వేసవిలో జరిగే ఇలాంటి ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

చెరువు నీటిలో మునిగి విద్యార్థి గల్లంతు


చెరువులో గాలిస్తున్న పోలీసులు, స్థానికులు

మర్రిగూడ : ఈత నేర్చుకునేందుకు వెళ్లి ఓ యువకుడు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన మండలంలోని శివన్నగూడ రిజర్వాయర్ పరిధిలోని నర్సిరెడ్డిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ మండలం అంతంపేటకు చెందిన మహమ్మద్ హుస్సేన్ అస్మత్‌లకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మహమ్మద్ ఖలీల్ (16) నల్లగొండ మైనార్టీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో తండ్రి మంగళవారం ఇంటికి తీసుకొచ్చాడు. బుధవారం సాయంత్రం నర్సిరెడ్డిగూడ సమీపంలోని చెరువులో ఈత నేర్చుకునేందుకు తన సమీప బంధువుతో కలిసి వెళ్లాడు. వారితో ఖలీల్ కూడా నీటిలోకి దిగారు. ఈత రాక పోవడంతో నీటి లోపలికి వెళ్తున్న ఖలీల్‌ను కాపాడేందుకు ఖలీల్ సమీప బంధువు మహమ్మద్ చాంద్ ప్రయత్నిస్తుండగా చాంద్ కూడా నీటిలో మునిగిపోతుండగా ఖలీల్ స్నేహితుడు మొద్దు చరణ్ చాంద్‌ను కాపాడాడు. నీటిలో పూర్తిగా మునిగిన ఖలీల్‌ను వారు కాపాడేందుకు ప్రయత్నించగా నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న మర్రిగూడ ఎస్ఐ కె.రంగారెడ్డి 20మంది జాలర్లతో ఖలీల్ జాడ కోసం రాత్రి వరకు వెతికించగా ఫలితం లేకపోయింది. ఖలీల్ జాడ కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.